పడకేసిన పారిశుధ్యం

- అపరిశుభ్రంగా చెత్త సేకరణ పాయింట్లు
- పందులు, కుక్కలు చేరడంతో చెత్తంతా రోడ్లపైనే
- విజృంభిస్తున్న దోమలు


ప్రధాన రహదారిలోని లారీ యూనియన్ కార్యాలయం ఎదురుగా అపరిశుభ్రంగా చెత్త సేకరణ పాయింట్


గతంలో టార్పాలిన్ వేసిన చెత్త సేకరణ పాయింట్ (ఫైల్)

రామచంద్రపురం: మున్సిపాలిటీలో పారిశుధ్యం పడకేసింది. సేకరించిన చెత్త రోడ్లపైనే ఉండటంతో పందులు, కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో దోమలు కూడా విజృంభిస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 28 వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో చెత్తను సేకరణకు 91 మంది మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు తోపుడు బండ్లు, మూడు ట్రాక్టర్లు, ఒక లారీ ద్వారా చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. అయితే ప్రతి ఇంటి నుంచి కార్మికులు సేకరించిన తడి చెత్త, పొడి చెత్తలను ఆయా వార్డుల్లోని ఏర్పాటు చేసిన పాయింట్‌ల వద్ద డంప్ చేసి తిరిగి వాటిని ట్రాక్టర్లు, లారీల ద్వారా కొత్తూరు రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. ఇలా పట్టణంలో మొత్తంగా 23 చెత్త సేకరణ పాయింట్లు ఏర్పాటు చేసి పెద్ద, చిన్న డబ్బాల్లో సేకరించిన చెత్త వేస్తున్నారు. ప్రతి వార్డులోనూ రోజు ఉదయం పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ తోపుడు బండితో ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి ఆయా పాయింట్ల వద్ద వేస్తుంటారు. వీటిని రోజు విడిచి రోజు లేదా అదే రోజు ఏదో సమయంలో వచ్చి ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తుంటారు. ఇటీవల కనీసం వారం రోజుల వరకు చెత్త సేకరణ పాయింట్ల వద్ద నుంచి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకపోవటంతో చెత్తంతా చెల్లా చెదురుగా పడి డంపింగ్ యార్డుగా తయారవుతోంది.

పార్కు బయట పారిశుధ్య లోపం

పట్టణంలోని బ్రాడీపేట పార్కుల వద్ద చెత్త సేకరణ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. వేసిన చెత్త అంతా పేరుకుపోయి పార్కు బయట అపారిశుధ్యంగా తయారయింది. పార్కుకు వచ్చేందుకు కూడా వీలు లేకుండా మారిపోతుంది. రోడ్డుమీదకు చెత్త చెల్లా చెదురుగా ఉండటంతో పందులు, కుక్కలు చేరుతున్నాయి. దీంతో చెత్త సేకరణ పాయింట్ మినీ డంపింగ్ యార్డుగా మారిపోయింది. పార్కు వద్ద ఉన్న చెత్త సేకరణ పాయింట్‌ను వెంటనే తొలగించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

గతంలో ఇలా...

గతంలో ప్రతి చెత్త సేకరణ పాయింట్ వద్ద డబ్బాలను ఏర్పాటు చేసి వాటి చుట్టూ నెట్‌లు, బరకాలు కట్టి బయటకు రాకుండా ఉంచేవారు. చెత్త వేసే సమయంలోను తీసే సమయంలోను మినహా మిగిలిన సమయాల్లో వాటిపై బరకాలు, నెట్‌లు వేసి ఉంచాలని అప్పట్లో మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో అప్పట్లో ఎక్కడా చెత్త బయటకు వచ్చేది కాదు. పరిశుభ్రంగా ఉండేవి. కానీ ప్రస్తుతం చెత్త సేకరణ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన డబ్బాలపై ఎక్కడా టార్పాలిన్‌లు గానీ, బరకరాలు గానీ కానరావడం లేదు. దీంతో డబ్బాల నుంచి చెత్త బయటకు వచ్చేస్తున్నాయి. వారం రోజులు అయినా చెత్తను తీయకపోవటంతో చెత్త సేకరణ పాయింట్లు మినీ డంపింగ్ యార్డుల్లా మారిపోతున్నాయి.

పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి



చెత్త సేకరణ పాయింట్ల వద్ద చెత్త పేరుకుపోకుండా మున్సిపాలిటీ అధికారులు గట్టి చర్యలు చేపట్టాలి. పార్కుల వద్ద ఏర్పాటు చేసిన చెత్త సేకరణ పాయింట్‌లను వెంటనే తొలగించి ప్రతీ రోజు చెత్తను డంప్ చేసే విధంగా చేసి పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

– వెన్నేటి బాబు, మాజీ కౌన్సిలర్

గత విధానాన్ని పునరుద్ధరించాలి



రెండేళ్ల క్రితం చేపట్టిన చర్యలను తిరిగి పునరుద్ధరించాలి. చెత్త సేకరణ కేంద్రాల వద్ద గతంలో టార్పాలిన్‌లు, బరకాలు వేసేవారు. దీంతో చెత్త బయటకు వచ్చేది కాదు. తిరిగి చెత్త సేకరణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఉండవు. ప్రజలు అధికంగా సంచరించే ప్రదేశాల్లో ఉండే సేకరణ కేంద్రాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– వాద్రేవు సాయిప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్

క్లుప్తంగా

గోగులాంబ అమ్మవారికి తీపి కావడి మహోత్సవం


భక్తులు సమర్పించిన తీపి కావడి, పండ్లు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసిన గోగులాంబ అమ్మవారికి ఆదివారం ఆషాఢమాసం పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీపి కావడి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి అక్కగా భీమ పురాణంలో ఉన్న ప్రకారం భీమేశ్వరాలయం నుంచి ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు మేళతాళాలతో అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, స్వీట్లు తీసుకుని ఊరేగింపుగా వచ్చి సమర్పించారు. అదే విధంగా వెలంపాలెంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి స్వీట్లు, చీరలు, పసుపు, కుంకుమలను కావడిగా తీసుకువచ్చి సమర్పించుకున్నారు. తిరణంపేటకు చెందిన రాజరాజేశ్వరి భజన బృందం, అముజూరు భజన గురువు సత్యనారాయణల ఆధ్వర్యంలో భజన కార్యక్రమం, మాణిక్యాంబ మహిళా సమాజం ఆధ్వర్యంలో లలితా పారాయణ చేశారు.

జగ్జీవన్ విగ్రహానికి క్షీరాభిషేకం


కపిలేశ్వరపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మాదిగ సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్ హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఆదివారం కపిలేశ్వరపురంలో ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షులు యార్లగడ్డ సత్యనారాయణను సత్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పోరాటాన్ని కృషిని కొనియాడారు. తమ సామాజిక వర్గీయుల భవిష్యత్‌కు సుప్రీం కోర్టు బంగారు బాట వేసిందన్నారు. కార్యక్రమంలో పలివెల వెంకట్రావు, ముమ్మిడివరపు పెద సత్యం కొమ్ము సతీష్, పలివెల సత్యనారాయణ, నాగరాజు, రాయి నాని పాల్గొన్నారు.

బాలికకు మంత్రి ఆర్థిక సాయం


హసన్‌బాదలో జ్యోత్స్నకు నగదు అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద గ్రామానికి చెందిన వాసంశెట్టి జ్యోత్స్న అరుదైన ఎముకల వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆమెకు ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాలికకు ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తానని మాటిచ్చారు.

అలీ అక్బర్‌కు ఘన నివాళి


ద్రాక్షారామలో అలీ అక్బర్ గుమ్మటాన్ని ఊరేగిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా కర్బలా పుణ్యభూమిలో అసువులు బాసిన ఇమామ్ హుస్సేన్ రెండో కుమారుడు అలీ అక్బర్ సంతాప దినాన్ని ఆదివారం ద్రాక్షారామలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శత్రువులతో వీరోచితంగా పోరాడి చివరకు బల్లెం ఛాతీలో గుచ్చుకుని వీర మరణం పొందిన ఘటనను ఢిల్లీ నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా సయ్యద్ హైదర్ మౌలాలీ జార్చివి వివరించారు. అలీ అక్బర్ పంజాలో ఉదయం నుంచి మజ్లిస్‌లు జరిగాయి. సాయంత్రం ఇమామ్ హుస్సేన్ పంజా నుంచి అలీ అక్బర్ తాబూత్ (గుమ్మటం) మాతంతో ఊరేగింపు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమనే అలీ అక్బర్ కమిటీ ఆధ్వర్యంలో ఆగావారి పెద్ద పంజాలో భోజన ఏర్పాట్లు చేశారు.

కదలాడిన 'జ్ఞాపకాలు'

- 'స్నేహితుల రోజు' పూర్వ విద్యార్థుల సందడి
- చెల్లూరు హైస్కూల్లో అపూర్వ కలయిక


చెల్లూరులో 50 ఏళ్ల అనంతరం కలుసుకుని గ్రూపు ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు


చెల్లూరు ఉన్నత పాఠశాలలో తరగతి గదిలో కూర్చుని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్న పూర్వ విద్యార్థులు

రాయవరం: విద్యార్థి దశలో చేసిన అల్లరి.. ఆటపాటలు.. వాటితో పాటు ఆనాడు చేసిన బంద్‌లు, నిరాహార దీక్షలు, ఉపాధ్యాయులు చెప్పిన మంచి మాటల ఫలితంగా ప్రస్తుత స్థాయికి చేరుకున్న వైనాన్ని పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే రోజునే చెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకుని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

50 ఏళ్ల అనంతరం

శ్రీ సర్వారాయ జెడ్పీ ఉన్నత పాఠశాల 1974–75 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 'వృద్ధులం కాదు..అదృష్టవంతులం' అనే ట్యాగ్‌లైన్‌తో అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తమ మిత్రులను కలుసుకునేందుకు వయసును సైతం లెక్క చేయకుండా..ఉత్సాహంతో పాఠశాల ఒడికి చేరుకున్నారు. నూనూగు మీసాల వయస్సులో విడిపోయిన మిత్ర బృందం 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న సమయంలో ఉద్విగ్నానికి లోనయ్యారు. ఒకరినొకరు గుర్తుపట్టేందుకు చేసే ప్రయత్నం.. కలుసుకున్న అనంతరం నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం..మరోమారు విద్యార్థులుగా మార్చింది. విద్యార్థి జీవితంలో చోటుచేసుకున్న చిలిపి ఘటనలను మరోమారు గుర్తు చేసుకున్నారు. వేదికపై తమ కుటుంబ సభ్యులకు పూర్వ మిత్రులను పరిచయం చేస్తూ..తాము చేరుకున్న స్థితిని తెలిపారు. గురువుల వద్దకు వెళ్లి తమను తాము పరిచయం చేసుకున్నారు. విద్యార్థి దశలో తెలిసీ తెలియక చేసిన ఆకతాయి తప్పులకు, అలనాడు గురువులు చేసిన దండనలను గుర్తుచేసుకుంటూ వారిని దుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. తమతో చదువుకుని పరమపదించిన పూర్వ విద్యార్థులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంలోనే పూర్వ విద్యార్థుల కలయికకు కారకులైన ఎంవీవీ సత్యనారాయణమూర్తి (పెదబాబు), శీని సూర్యారావు (చిట్టిబాబు), పాలకుర్తి సత్యనారాయణ తదితరులను సహ పూర్వ విద్యార్థులు అభినందించారు. కేక్ కట్ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా తాము చదువుకున్న తరగతి గదిలో బెంచీలపై కూర్చుని మరోసారి అటెండెన్స్ వేయించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా తమ వంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. అలాగే ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న సింగిల్ పేరెంట్ స్టూడెంట్స్‌కు పదో తరగతి పూర్తయ్యే వరకు ఏటా ఆర్థిక సహకారం అందించేందుకు నిర్ణయించుకున్నారు.


అంగరలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకుని ఐక్యత చాటుతున్న చిన్నారులు

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో చిన్నారులు గ్రామాల వీధుల్లో సహచర మిత్రులకు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టి అనుబంధాలను చాటుకున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులు తమ స్నేహితులకు సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు చెప్పుకుంటూ గడిపారు.

సుప్రీం తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ ర్యాలీ


గొల్లపాలెంలోని కాకినాడ, కోటిపల్లి రహదారిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాజులూరు: ఎస్సీ వర్గీకరణ అమలుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం గొల్లపాలెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు ఖండవల్లి శ్రీనివాసరావు, పలివెల రాజు, ఎమ్ఈఎఫ్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు హాజరై గొల్లపాలెం గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ తీన్‌మార్, గారడి, డప్పు వాయిద్యాలతో భారీ ఎత్తున బహిరంగ ప్రదర్శనలు నిర్వహించారు. ముందుగా ఎస్సీ పేటలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పలువురు ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ తదితర నాయకుల నాయకత్వంలో మాదిగ, మాదిగ ఉప కులాలు చేస్తున్న పోరాటానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయం జరుగుతుందన్నారు. ఇది ఏ ఒక్కరి గెలుపు, ఓటములకు సంబంధించిన విషయం కాదని సుప్రీంకోర్టు తీర్పుతో అందరి సమాన హక్కులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పలివెల సూరిబాబు, పి.ఇస్రాయేల్‌రాజు, పి.విశాల్, ఉందుర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు ఉండకుండా చూడాలి

అంబాజీపేట: మన పరిసరాల్లో వాడకంలో లేని పాత్రలు, సామగ్రిలో ఎటువంటి నీరు నిల్వ లేకుండా చూడాలని లేని పక్షంలో దోమలు విపరీతంగా పెరిగే అవకాశాలున్నాయని సీహెచ్ఓ బి.అప్పారావు, ఎస్ఈఓ ఎస్‌వీ రామారావులు ప్రజలకు వివరించారు. గంగలకుర్రు అగ్రహారం శివారు జైభీమ్‌నగర్‌లో ఆదివారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. మూడు రోజులు కంటే జ్వరం ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం దోమల నివారణకు ఎబేట్ మందు స్ప్రే చేయించారు.

వ్యక్తి అరెస్ట్

అయినవిల్లి: ఆస్తి వివాదం నేపథ్యంలో కత్తి పీటతో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలంలోని శానపల్లిలంక తూర్పుపేటకు చెందిన తొత్తరమూడి వెంకన్నబాబు, తొత్తరమూడి నాగరాజుల మధ్య శుక్రవారం ఆస్తి వివాదం నేపథ్యంలో గొడవ జరిగింది. గాయాలపాలైన వెంకన్నబాబును జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు నాగరాజును అరెస్టు చేసి అమలాపురంలోని కోర్టుకు తరలించినట్లు తెలపారు. జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి



ఉచిత డీఎస్సీ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి సుభాష్

రామచంద్రపురం: ఎస్సీ బాలుర అంబేడ్కర్ వసతి గృహాన్ని తక్షణమే మార్చాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పీడీఎస్‌యూ బృందం ఆదివారం వినతి పత్రం అందించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, పీవైఎల్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమ శంకరం మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 12కు పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని రామచంద్రపురం, హసన్‌బాద, కె.గంగవరం హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాల్లోనే నేటికీ వసతి గృహాలు కొనసాగిస్తున్నారన్నారు. ఎప్పుడు కూలుతాయోనని భయం గుప్పిట్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. ఇటీవల రామచంద్రపురం ఎస్సీ బాలుర అంబేడ్కర్ కాలేజీ హాస్టల్, హై స్కూల్ బాలుర వసతి గృహంలో వర్షానికి తడిసిన గోడలు, శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి పడిపోయాయని పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలని కోరారు. అలాగే పలు సమస్యలన ప్రస్తావించారు. సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని మంత్రిని కోరారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ పీడీఎస్‌యూ ఎం.సాయి చరణ్, కె.సుధీర్, వై.సతీష్, కరుణాకర్, కె.కిరణ్, అజయ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పోస్టర్ ఆవిష్కరణ

రామంచద్రపురం: త్వరలో నిర్వహించనున్న డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, దానిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పట్టణంలోని ఒక హోటల్‌లో మీట్ ద ప్రెస్ కార్యాక్రమం నిర్వహించి ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక వీఎస్ఎం కళాశాలలో ఈనెల 11 నుంచి డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అభ్యర్థులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. త్వరలోనే మరో జాబ్ మేళాను నిర్వహిస్తామని తెలిపారు.

వాహనదారులంతా భద్రతా నియమాలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శాస్త్రి

మండపేట: వాహనాలు నడిపే వారందరూ విధిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రి సూచించారు. పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ఆదివారం ఆయన రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. బైపాస్ రోడ్డులోని ఓ ప్రైవేట్ లే-అవుట్‌లో శ్రీలక్ష్మీ గణపతి గూడ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలో గూడ్స్, ప్యాసింజర్ ఆటోలు ఎక్కువగా ఉన్నందున డ్రైవర్లంతా విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఆటోలను పార్కింగ్ చేసేటపుడు ఇతర వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడుతున్నా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చిన్నారావు, యూనియన్ నాయకులు కొంకి రాంబాబు, మెండు బాపిరాజు, షేక్ హుస్సేన్, చింతా సత్యనారాయణ, చల్లా వెంకటేష్, చంటి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యాంబ అమ్మవారికి ఆషాఢం సారె


హసన్‌బాదలో మాణిక్యాంబ అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో వేంచేసిన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు మాణిక్యాంబ అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ఆషాఢం సారె సమర్పించారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. గ్రామ మహిళలు అమ్మవారికి సారె తీసుకుని మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా విచ్చేశారు. ఆలయ అర్చకుడు ఉండి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో సహస్ర కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, గ్రామ పెద్దలు చోడిశెట్టి భద్రరావు, చెక్కా తాతాజీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో 'బొత్స' గెలుపు ఖాయం


మీడియాతో మాట్లాడుతున్న పిల్లా వీరబాబు

మండపేట: ఆగస్టు 30న జరిగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను అధిష్టానం ఎంపిక చేయడం హర్షణీయమని ఆ పార్టీ మండపేట రూరల్ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు అన్నారు. స్థానిక విజయలక్ష్మి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా కాపులకు, బీసీ కాపులకు వైఎస్సార్ సీపీ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ లో మొత్తం 830 మంది ఓటర్లు ఉండగా వారిలో 615 మంది వైఎస్సార్ సీపీ సభ్యులైతే కూటమి బలం కేవలం 217 మంది సభ్యులు మాత్రమే అన్నారు. ఈ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీతో బొత్స సత్యనారాయణ విజయం సాధించడం ఖాయమని వీరబాబు ధీమా వ్యక్తం చేశారు.

మానసిక ప్రశాంతతకు మూలం ధ్యానం


పిరమిడ్ మాస్టర్ మణికంఠను సత్కరిస్తున్న ఫణికృష్ణారెడ్డి, సీత దంపతులు

రాయవరం: నేటి ఆధునిక సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, ఒత్తిడిని జయించి మానసిక ప్రశాంతత పొందడానికి ధ్యానం మూలాధారమని యోగా, పిరమిడ్ మాస్టర్ వెలగల ఫణికృష్ణారెడ్డి అన్నారు. స్థానిక సత్యసాయి సేవా మందిరం వద్ద కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికృష్ణారెడ్డి మాట్లాడుతూ ధ్యానం చేయడం వలన శ్వాసపై నియంత్రణ వస్తుందన్నారు. మనసు నిర్మలంగా మారి, పాజిటివ్ థింకింగ్ అభివృద్ధి చెందుతుందన్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ మణికంఠ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని ధ్యానానికి కేటాయించాలన్నారు. జీవన ప్రమాణం పెరగడానికి ధ్యానం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. అనంతరం ధ్యాన శిక్షణలో భాగంగా 12 స్పిరుట్యువల్ టాబ్లెట్స్ అనే ఆరోగ్య తరగతిని మణికంఠ ఉదాహరణలతో, కథలతో ఆసక్తిగా అందించారు. రాయవరం, మాచవరం, పులుగుర్త, సోమేశ్వరం తదితర గ్రామాల నుంచి సుమారు 55 మంది ధ్యానాభిలాషులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్ మణికంఠను యోగా, పిరమిడ్ మాస్టర్ ఫణికృష్ణారెడ్డి దంపతులు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

చివరి దశలో నాట్లు


కె.గంగవరంలో కనుచూపు మేర వరినాట్లతో పచ్చగా కనిపిస్తున్న పొలాలు

కె.గంగవరం: మండలవ్యాప్తంగా ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు వర్షాలు అంతంతమాత్రం పడినా రైతులను మాత్రం నిరాశపరిచింది. అయితే గత రెండు వారాల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తొలకరి పనులను రైతులు ముమ్మరం చేశారు. మండల వ్యాప్తంగా 95 శాతం నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారులు చెప్పారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో కాలువలు, పంట బోదెలు, ఊటకాలువలు సాగు నీటితో నిండిపోయాయి. కోటిపల్లిలోని ప్రధాన కాలువ, కె.గంగవరంలోని టీకి డ్రైయిన్, పామర్రులోని రాజు కాలువలు నీటి ప్రవాహంతో కళకళలాడుతూ ప్రవహిస్తున్నాయి. వర్షాలు పూర్తి స్థాయిలో కురవడం వల్ల నాట్లు వేయడంతో పుడమికి పచ్చదనం వచ్చి పొలాలు ఆహ్లాదంగా మారాయి.